
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం


మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 137 | గురువారం 10 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-






# సమావేశాలు కాదు.. ఫలితాలు కన్పించాలి

## నాకు వాస్తవ నివేదికలు కావాలి..

## కరవు ప్రాంతాలకు నీళ్లిస్తేనే నాకు సంతృప్తి

## కలెక్టర్లు, అధికారులు, మంత్రుల మధ్య పోటీ ఉండాలి

## కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 10):**

శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెరీ స నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెరీ సకు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెరీ ?స మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెరీ గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్--వన్ విజన్--వన్ టీమ్--వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు. "మనకు ఉన్న అవకాశాలను అరీ లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10--15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయాలని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పందించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి... మంచి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో - మిగతా2లో

# సీసీఎల్ఏలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్

## ఎస్సీలకు కలిగే ప్రయోజనాలను బుడగ జంగాలకూ వర్తింపు

## కలెక్టర్ల సదస్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సీఎం చంద్రబాబు ఆదేశాలు



**(అంకుశం, అమరావతి, సెప్టెంబరు 10):**

రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న భూములకు సంబంధించి స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్‌ను తయారు చేయాలని రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టులపై చర్చ సందర్భంగా వేర్వేరు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండిపోతున్న భూముల్ని గుర్తించి వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సీఎం స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయ్యాక ప్రభుత్వ భూములపై పూర్తి స్పష్టత వస్తుందని సీఎం అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఏళ్లుగా వినియోగం లేని భూముల్ని గుర్తించాలన్నారు. వాటి వివరాలను కామన్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్ కిందకు తీసుకు రావాలన్నారు. జిల్లాలు, శాఖల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏ ప్రభుత్వ శాఖకు భూమి అవసరమైనా ఈ పోర్టల్ ద్వారా కేటాయించే పరిస్థితి ఉండాలని అన్నారు. భూమి కొరత అభివద్ధికి అడ్డంకి కాకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు అయిన తర్వాత భూమి కోసం వెతకకుండా - మిగతా2లో

# 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్



## 28 లక్షల ఎకరాలు 22-ఏ జాబితా నుండి తొలగింపు

## దీర్ఘకాలిక భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

## కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో మంత్రి అనగాని సత్యప్రసాద్

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 10):**

రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూసమస్యలకు చరమగీతం పాడుతూ, భూయజమానులకు వారి ఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన 4 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి విచారణ తర్వాత తగు నిర్ణయం తీసుకుంటా మన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా 22--ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే తొలగించామని తెలిపారు. 22--ఏ తొలగింపు ప్రక్రియను సులభతరం చేస్తూ జీవో నెం.444 జారీ చేశామని, దీని ద్వారా వచ్చిన 28,790 ఎకరాల దరఖాస్తుల్లో ఇప్పటికే 1,100 ఎకరాలను జాబితా నుంచి తొలగించామని, మిగిలిన వాటిపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇకపై ఏదైనా ప్రైవేట్ భూమిని 22--ఏ జాబితాలో చేర్చాలంటే సంబంధిత అధికారే ఆ భూమి స్వభావాన్ని నిరూపించాల్సి ఉంటుందని, అందుకు స్పష్టమైన విధివిధానాలతో జీవో నెం.445 తెచ్చామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో పెడితే అధికారులపై కఠిన చర్యలు - మిగతా2లో

# కుంభకోణాల చరిత్రలో చంద్రబాబు ఓ ఆణిముత్యం

## కొడుకును కాపాడుకునే ఆరాటంలో డీఎస్సీ స్కామ్‌ను నిర్వీర్యం

## తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు.. పై నుంచి కింది స్థాయి వరకు కుమ్మక్కు

## మీడియా సమావేశంలో వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి



**(అంకుశం, తాడేపల్లి, సెప్టెంబర్ 10):**

చంద్రబాబు కుంభకోణాల చరిత్రలో డీఎస్సీ స్కామ్ అనేది ఓ ఆణిముత్యమని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో డీఎస్సీ అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. డీఎస్సీ స్కామ్‌ను దగ్గరుండి నిర్వీర్యం చేస్తున్నారని, కొడుకును కాపాడుకోవాలనే ఆరాటంలో చంద్రబాబు ఉన్నారని వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతూ వ్యవస్థలపై నమ్మకం లేకుండా చేస్తున్నారని అన్నారు. ఇలాంటి స్కామ్‌ల వల్లే కాక్రోచ్‌లు (కాక్రోచ్ జనతా పార్టీ.. జెన్ జీ ఉద్యమాన్ని ఉద్దేశించి) పుట్టుకొస్తున్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ కుంభకోణంలో పై నుంచి కింది స్థాయి వరకు కుమ్మక్కయ్యారని, తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఇచ్చేశారని వైయస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఖమ్మం (తెలంగాణ)లో జరగని ఈవెంట్ల పేరుతో ఉద్యోగాలు ఇచ్చిన కేసును ఆధారాలతో సహా చూపించారని పేర్కొన్నారు. ఆ జూడో అసోషియేషన్ అధ్యక్షుడు చంద్రబాబు దగ్గరి బంధువు, టీడీపీ ఎంపీ భరత్ అని తెలిపారు. సాఫ్ట్‌బాల్ - మిగతా2లో

అంకుశం
సాయంకాలం దినపత్రిక
గురువారం 10 సెప్టెంబర్ 2026

# 20 మందికి రూ.17.82 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన దగ్గుపాటి ప్రసాద్





**అంకుశం న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 10** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో సీఎం ఆర్ఎమ్ చెక్కులను అనంతపురం శాసనసభ్యులు దగ్గుబాటి ప్రసాద్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూగత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టులు కూడా భర్తీ చేయని నాయకులు.. ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నా రని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 35వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 20 మందికి 17 లక్షల 82వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు 713 మందికి 7కోట్ల 12లక్షల రూపాయల మేర ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కేవలం రెండేళ్లలోనే ఇంతమందికి సాయం చేశామని.. అయితే గత వైసీపీ పాలనలో కనీసం 80 లక్షల రూపాయలు కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించలేదన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి వెళ్లిపోతే.. కేవలం ఏడాదిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఓవైపు మంత్రి నారా లోకేష్ ఇంకోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వలన రాష్ట్రానికి 25 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో రాయలసీమ అంటే కరవు ప్రాంతంగా చెప్పుకునే వారని ఇప్పుడు అదే ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా మార్చారన్నారు. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు ప్రతిష్టాత్మక కంపెనీలు తీసుకొచ్చారన్నారు. పుట్టపర్తి ప్రాంతానికి లక్ష కోట్ల పెట్టుబడితో డిఫెన్స్ ఇండస్ట్రీని తీసుకొచ్చారన్నారు. తద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకంతోనే 16,347 పోస్టుల ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశారన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియను 148 రోజుల్లో పూర్తి చేశారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరే విధంగా మార్పులు తీసుకొచ్చారన్నారు. గతంలో ఉపాధ్యాయులను బాత్రూంల వద్ద, వైన్ షాపులు వద్ద ఉంచి అవమానించిన వైసీపీ వారు ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారన్నారు. అసలు వారికి డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. హంద్రీనీవా గతంలో కేవలం 1800 క్యూసెక్కులు మాత్రమే ఉండేదని.. ఇప్పుడు ఏకంగా 4వేల క్యూసెక్కులకు పెంచి శ్రీశైలం నుంచి నీరు తీసుకొస్తున్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. 250 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక వసతులు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో మరో 310 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు.

# విద్య ఉంది.. ఉద్యోగం ఎక్కడ?

....చదువు--నైపుణ్యం--ఉపాధి మధ్య పెరుగుతున్న అంతరం.

.....యువత భవిష్యత్తుపై ఆందోళన

కళ్యాణదుర్గం )

దేశం వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలోకి అడుగులు వేస్తున్నప్పటికీ, విద్యను ఉపాధితో అనుసంధానిం చడంలో ఉన్న సవాళ్లు యువత భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు ఉన్నత విద్యకు ప్రాధాన్యం పెరుగు తుండగా.. మరోవైపు చదువు పూర్తయిన తర్వాత తగిన ఉద్యోగం లభించకపోవడం, నైపుణ్యాలకు సరిపడే అవకాశా లు లేకపోవడం సమస్యగా మారుతోంది. దీంతో విద్యకు ఖర్చు పెరుగుతున్నా.. విద్యకు తగ్గ ఉపాధి అవకాశాలు ఎంతవరకు అందుతున్నాయన్న ప్రశ్న ముందుకు వస్తోంది. తాజా కేంద్ర ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే -2025 ప్రకారం 15--29 ఏళ్ల యువతలో నిరుద్యోగిత రేటు 9.9 శాతంగా ఉంది. గ్రామీణ యువతలో 8.3 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 13.6 శాతంగా నమోదైంది. యువతలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కోసం పోటీ తీవ్రంగా ఉన్న పరిస్థితిని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

**చదువు పెరిగినా.. ఉద్యోగం సవాలే**

అధికారిక గణాంకాల ప్రకారం 2025లో మాధ్యమిక విద్య లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగిత 6.5 శాతంగా ఉంది. 2024లో నమోదైన 7 శాతంతో పోలిస్తే ఇది తగ్గినప్పటికీ, విద్యావంతుల ఉపాధి సమస్య పూర్తిగా పరిష్కారమైనట్లు భావించలేమని నిపుణుల విశ్లేషణలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ కూడా భారతదేశంలో యువతలో విద్యా స్థాయి పెరుగుతున్నప్పటికీ, వారి విద్యా అర్హతలకు సరిపోయే ఉపాధి అవకాశాల సృష్టి అంత వేగంగా జరగడం లేదని తన ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024లో పేర్కొంది. నైపుణ్యాలు, ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాల మధ్య అంతరం కూడా సమస్యగా ఉందని నివేదిక విశ్లేషించింది.

**ప్రభుత్వ, ప్రైవేటు విద్య మధ్య అంతరం:-**

దేశంలో విద్యా ప్రాప్తి విస్తరించినప్పటికీ, విద్యా నాణ్యతలో



సమానత్వం ఇంకా ప్రధాన సవాలుగానే ఉంది. ఆూజు=-2024 ప్రకారం గ్రామీణ భారతదేశంలో పాఠశాలల్లో చేరిక రేట్లు 6--14 ఏళ్ల వయసులో 98.1 శాతంగా ఉన్నాయి. అయితే చదవడం, గణితం వంటి ప్రాథమిక సామర్థ్యాల్లో విద్యార్థుల మధ్య ఇంకా తేడాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన స్థాయిలు మెరుగుపడుతున్నప్పటికీ, ప్రైవేటు పాఠశాలలతో వ్యత్యాసం పూర్తిగా తొలగిపోలేదని నివేదిక వెల్లడించింది. అందువల్ల పిల్లలను పాఠశాలలో చేర్పించడం మాత్రమే కాదు.. వారు ఏం నేర్చుకుంటున్నారు, ఆ విద్య భవిష్యత్తులో వారికి ఏ నైపుణ్యాలను అందిస్తోంది అన్నదే కీలకం.

**డిగ్రీ నుంచి ఉద్యోగం వరకు.. మారాల్సిన దారి:-**

సాంప్రదాయ విద్యా విధానంలో డిగ్రీ, పీజీ, పరిశోధన వంటి విద్యార్హతలు సాధించడం మాత్రమే విజయానికి మార్గంగా భావించే పరిస్థితి నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ సామర్థ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు, వృత్తి విద్య వంటి అంశాలను విద్యలో మరింత బలంగా అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రతి విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగాన్నే లక్ష్యంగా పెట్టుకునే పరిస్థితి కూడా మారాలి. ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామిక రంగం, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలు, సేవా రంగం, స్టార్టప్‌లు, స్థానిక ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం పెరగాలి.



**యువతలో నిరాశ పెరగకుండా చర్యలు అవసరం**

చదువు పూర్తయినా ఉపాధి దొరకకపోవడం యువతలో నిరాశకు కారణమయ్యే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు లేకపోవడం కేవలం వ్యక్తిగత ఆర్థిక సమస్య మాత్రమే కాదు.. కుటుంబ ఆర్థిక పరిస్థితి, సామాజిక స్థిరత్వం, యువత భవిష్యత్తు వంటి అంశాలపైనా ప్రభావం చూపే సమస్య. అందుకే విద్యా వ్యవస్థను ఉపాధి మార్కెట్‌తో అనుసంధానం చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వడం, గ్రామీణ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధికి ఆర్థిక మరియు సాంకేతిక సహకారం అందించడం అత్యవసరం.

**మానవ వనరులే దేశానికి అసలైన సంపద:-**

భారతదేశానికి విస్తారమైన యువ జనాభా ఒక గొప్ప అవకాశమైతే, వారికి నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, గౌరవప్రదమైన ఉపాధి కల్పించడం పెద్ద బాధ్యత. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యా విధానం కూడా అదే వేగంతో మారాల్సిన అవసరం ఉంది. విద్య కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా.. జీవితానికి ఉపయోగపడే జ్ఞానం, నైపుణ్యం, ఉపాధి కల్పించే సాధనంగా మారాలి. యువతకు అవకాశాలు కల్పిస్తేనే జనాభా శక్తి ఆర్థిక శక్తిగా మారుతుంది. లేకపోతే అదే జనాభా ఒత్తిడిగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే దేశం ముందుకు సాగాలంటే విద్యా నాణ్యత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి, పారిశ్రామికాభివృద్ధి అనే నాలుగు అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలి. యువతకు చదువు మాత్రమే కాదు.. చదువుకు తగ్గ భవిష్యత్తు కూడా కావాలి.

## టిడిపి కార్యకర్త పార్టీ పార్థివ దేహానికి... తెలుగు తమ్ముళ్ల నివాళులు.

**మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి.**



**గోరంట్ల :** మండలంలోని వడిగేపల్లి పంచాయతీ గొల్లపల్లి కి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేష్ కుమారుడు బెంగుళూరు లో ఆక్సిడెంట్ లో మరణించడం జరిగింది. గొల్లపల్లి లో పార్థివాదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్ మరియు లిజిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, పాలసముద్రం సింగల్ విండో అధ్యక్షులు బెల్లలచెరువుచంద్ర, మాజీ జడ్పీటీసీ సుబ్బారెడ్డి, మహమ్మద్, మాజీ సర్పంచ్ నరసింహామూర్తి, స్టోర్ డీలర్ చంద్రప్ప,హరిష్ రెడ్డి,పంచాయతీ అధ్యక్షులు ఆదినారాయణ, రవి.పాల్గొన్నారు.

## ఎన్నికల హామీను విస్మరించిన కూటమి ప్రభుత్వం

**50 ఏళ్లు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సామాజిక పింఛన్ వెంటనే ఇవ్వాలి**

**వైయస్సార్ సిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్**



**మడకశిర :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ అంటూ 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు సామాజిక పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఈ రోజు ఆ వర్గాలను విస్మరించింది. కేవలం అధికారంలోకి రావడం కోసం మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీతో ఓట్లు దండుకొని ఈ రోజు అధికారంలోకొచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్న ఎందుకు వారికి పించెను ఇవ్వలేకపోతున్నారో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలి. కేవలం స్థానిక ఎన్నికల కోసం కూటమి ప్రభుత్వం హడావుడిగా పింఛన్లకు దరఖాస్తుకు అవకాశం ఇస్తూ ఆంక్షలు విధించడం చాలా బాధాకర విషయం. డప్పు కళాకారులు చర్మకారులు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి సర్టిఫికెట్ తీసుకురండి అని చెప్పడంతో డప్పు కళాకారులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. వెంటనే వారికి స్వీయ ధృవీకరణ పత్రంతో (సెల్ఫ్ డిక్లరేషన్) పింఛన్ మంజూరు చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏవైతే పింఛన్లు తొలగించినారు వాటిని యథాప్రకారం కొనసాగించాలని కోరుచున్నాం ప్రభుత్వం అలా చేయని పక్షంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు మరియు డప్పు కళాకారులు చర్మకారులు తరఫున సామాజిక పింఛన్ వచ్చేంతవరకు అర్హత కలిగిన వారికి మద్దతుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలియజేస్తున్నాం అని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

## సమావేశాలు కాదు.. ఫలితాలు కన్పించాలి

-మొదటిపేజీ తరువాయి

పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ టెక్నాలజీని తీసుకువచ్చి రాష్ట్రంలో అమలు చేశాం. గతంలో రూ.16 మీటరు డ్రిప్ పైప్ ఖరీదు. ఇప్పుడు 30 ఏళ్ల ద్రవ్యోల్బణం తర్వాత రూ.1.60 పైసలకే దొరుకుతోంది. రాయలసీమ జిల్లాల్లో డ్రిప్ ద్వారా చేసిన సాగు, సష్టించిన సంపదే దీనికి ఉదాహరణ. పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించారు. కానీ ఆదే ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకూ 500 టీఎంసీల నీటిని తరలించగలిగాం. ప్రకాశం బ్యారేజీని 200 సార్లు ఇప్పటి వరకూ నింపగలిగాం. డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సష్టించిన నిశ్శబ్ద నీటి ప్రయాణాన్ని రాష్ట్ర ప్రజలు, దేశం కూడా గుర్తించింది. రైతుల గురించి సీఎం పడుతున్న నిరంతర తపనను ఎకనమిక్ టైమ్స్ పత్రిక వాటర్ మాన్ గా ఆయన్ను కీర్తిస్తూ కథనం రాసింది. ఇది సీఎం సాధించిన విజయం.. ముఖ్యమంత్రి విజయంలో ఏపీ అభివద్ధి ఉంది." అని మంత్రి అన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీసీఎల్ఏలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్

-మొదటిపేజీ తరువాయి

ముందుగానే పారిశ్రామిక, అభివద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ శాఖ, జిల్లా కలెక్టర్ స్పష్టమైన యాక్షన్ క్యాలెండర్ ను రూపొందించుకుని నిర్దేశిత గడువులోగా ఫలితాలు సాధించాలన్నారు. కలెక్టర్ల సదస్సు కేవలం చర్చలకు మాత్రమే పరిమితం కాకుండా ఫలితాలను సాధించేలా ఉండాలన్నారు. జిల్లాల అధిపతులుగా కలెక్టర్లు అన్ని శాఖల అభివద్ధి కార్యక్రమాలపై 360 డిగ్రీల కోణంలో దష్టి సారించాలని అన్నారు. శాఖల మధ్య ప్రభావితం అయ్యే పనుల్ని కలెక్టర్ పరిష్కరించాలన్నారు. సమస్యల్ని ప్రస్తావించటం ఒక్కటే కాకుండా పరిష్కారం చూపేలా కలెక్టర్లు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బాధ్యతను మరొకరికి బదిలీచేసే తత్వాన్ని విడనాడాలన్నారు. ముఖ్యమంత్రిగా తాను మూడు నెలల కార్యక్రమాలను ముందే నిర్దేశించుకుంటా నని వెల్లడించారు. ప్రతీ నెలా ఎస్ఐపీబీ సమావేశాలతో పాటు ప్రతీ 15 రోజులకూ కేబినెట్ సమావేశంతో పాటు ప్రతీ మూడు నెలలకూ కలెక్టర్ల సదస్సు, ప్రతీ నెలా 4 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రజల దగ్గరకు వెళ్తున్నానని అన్నారు. ఎస్సీ వర్గాలకు ఇచ్చే ప్రయోజనాలను బుడగ జంగాలకు పొడిగించే అంశంపై తక్షణం ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బుడగ జంగాలకు ఎస్సీ హోదా కల్పించే అంశం పెండింగులో ఉన్న నేపథ్యంలో ఎస్సీలకు కలిగే ప్రయోజనాలను వారికీ అందించాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ పరిశ్రమలతో నైపుణ్యాభివద్ధి కార్యక్రమాన్ని అనుసంధానించాలని అన్నారు. కరిక్యులమ్, పరికరాలు తదితర అంశాలను 90 రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన గహాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. అదనంగా మంజూరు అయ్యే గహాలను దశలవారీగా అమలు చేయాలని సీఎం నిర్దేశించారు. త్వరలోనే మరో 1.5 లక్షల గహాలు ఏపీకి అదనంగా మంజూరు అయ్యే అవకాశం ఉందని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా విషయంలో అత్యవసర పనుల్ని వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రంలో 50 శాతం హరిత ప్రాంతాన్ని సాధించేలా ప్లాంటేషన్ సీజన్ కు ముందే అవసరమైన 20 కోట్ల విత్తనాలను, మొక్కల్ని సిద్ధం చేసుకోవాలన్నారు. తక్కువ నీటి అవసరం ఉన్న మొక్కల్ని ప్రోత్సహించాలని నీటి సంరక్షణా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 905 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్రంతో మాట్లాడాలని స్పష్టం చేశారు.

## కుంభకోణాల చరిత్రలో చంద్రబాబు ఓ ఆణిముత్యం

-మొదటిపేజీ తరువాయి

విషయంలోనూ ఇదే జరిగిందని, దాని అధ్యక్షుడు ఎమ్మెల్యే కూన రవి అని గుర్తు చేశారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన ఆధారాల ఆధారంగా దొంగ సర్టిఫికెట్లను గుర్తించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంటూ.. కుంభకోణం జరిగిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏంటని వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. డీఎస్సీ స్కామ్‌లో వాస్తవాలు బయటపడుతున్నా.. దాన్ని కప్పిపుచ్చేందుకు కూటమి ప్రభుత్వం పడరాని పాట్లు పడుతోందని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పోర్ట్స్ కోటాలో అర్హతలు లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని, ఏడుసార్లు వెరిఫికేషన్ చేసిన తర్వాతే నియామకాలు చేపట్టామని అధికారుల ద్వారా చెప్పిస్తూ ఇప్పుడు కవర్‌అప్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఏ పరీక్ష రాయకుండానే విశాఖపట్నంకు చెందిన యోగేశ్వరరావుకు స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ ఉద్యోగం ఇచ్చారని ఆరోపించారు. ఆయనతో పాటు ఆయన సోదరికి కూడా ఉద్యోగం ఇచ్చారని, కుటుంబం మొత్తానికి 'ఫ్యామిలీ ప్యాకేజీ'లా పోస్టులు కట్టబెట్టారని విమర్శించారు. ఈ వ్యవహారంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కీలకంగా వ్యవహరించిందన్నారు. యోగేశ్వరరావు, మోహినీదేవి పేర్లు తాము నిర్వహించిన ఈవెంట్‌లో లేవని తెలంగాణ ఖోఖో అసోసియేషన్ స్పష్టం చేసిందని వైయస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. అయినప్పటికీ వారు పోటీల్లో పాల్గొన్నట్లు చూపించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ప్రగడ కల్యాణి విషయంలోనూ ఇదే తరహా వ్యవహారం జరిగిందన్నారు. ఆమె కబడ్డీ పోటీలో పాల్గొన్నట్లు పేర్కొన్నప్పటికీ.. 2003లో నాగార్జున యూనివర్సిటీలో సౌత్ జోన్ కబడ్డీ పోటీలు జరిగాయని, కాబట్టి ఆమె సమర్పించింది నకిలీ సర్టిఫికెట్‌గా తేలిందని ఆయన చెప్పారు. ఈడిగ ప్రభాకర్ వ్యవహారాన్ని కూడా వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తావించారు. ఆయన టెట్‌కు క్వాలిఫై కాలేదని, కనీస విద్యార్హత కూడా లేదని డీఈవో స్వయంగా వెల్లడించారని తెలిపారు. అయినా ఉద్యోగం ఎలా వచ్చిందని ప్రశ్నించారు.

## 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్

-మొదటిపేజీ తరువాయి

తప్పవని హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వట్టిచెరుకూరు, శెట్టిపల్లి, పుల్లడిగుంట, కంగుంది, అవులపల్లి, గూటుపల్లి సహా కోనసీమ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో వేలాది మందికి ఆస్తులపై హక్కులు పునరుద్ధరించామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గంలోనూ స్థానిక ఎమ్మెల్యే చొరవతో నాలుగు గ్రామాల్లోని రెండు వేల ఎకరాలకు పైగా నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికై 'మీ భూమి -- బ్లాక్‌చైన్ టెక్నాలజీ' ప్రాజెక్ట్ ను అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ ను విజయవంతం చేసేందుకు కలెక్టర్లు నిరంతరం ప్రాజెక్టు అమలు తీరును పర్యవేక్షించాలన్నారు. గత ప్రభుత్వంలో మాదిరి తప్పులకు ఆస్కారం లేకుండా రీ సర్వే 2.0ను సమర్థవంతంగా చేస్తున్నామని, సర్వే శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరగడం సంతోషకరమని, అయితే వందశాతం తప్పుల్లేకుండా రీ సర్వే చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం..

**పరకాల :** పరకాల పట్టణ కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ పరకాల డివిజన్ స్థాయి నాయకుల సమీక్ష సమావేశంను నాయకులు భోజ శ్రీనివాస్ రెడ్డి, సునేందర్, గడ్డం బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ, టీయూడబ్ల్యూజే--ఐజేయూను నమ్ముకున్న ప్రతి జర్నలిస్టు కష్టసుఖాల్లో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని టీయూడబ్ల్యూజే--ఐజేయూ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ వల్లాల రమణ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద జర్నలిస్టు సంఘంగా ఐజేయూ సాధించిన విజయాలు, కొనసాగిస్తున్న పోరాటాలను ప్రతి జర్నలిస్టు గుర్తుంచుకోవాలని కోరారు. పరకాల పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ పరకాల డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి దశలవారీగా కార్యక్రమాలు చేపట్టి మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయించేలా రాష్ట్ర అధ్యక్షుడు విరహతు అలీ, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. పరకాల డివిజన్‌లో టీయూడబ్ల్యూజే--ఐజేయూ బలంగా ఉందని, త్వరలో జరగనున్న పరకాల ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో తమ యూనియన్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యర్థి యూనియన్ ఎన్ని ఆటంకాలు కల్పించినా ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు.

# అర్హులైన చేనేత కార్మికులకు పింఛన్ కోసం ప్రభుత్వ నిబంధనలను తొలగించాలి..

## ఏపీ చేనేత కార్మిక సంఘం వినతి

**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 10** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన చేనేత కార్మికులకు పెన్షన్ కోసం అనేక రకాల నిబంధనలను విధించింది అని వాటిని తొలగించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత అధికారి అప్పాజీ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది .ఈ సందర్భంగా ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జే వి రమణ, జిల్లా నాయకులు ఎస్ హెచ్ భాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన చేనేత కార్మికులకు పెన్షన్ మంజూరు కోసం కార్మికుల నుంచి అనేక రకాల పత్రాలను కోరడం చాలా బాధాకరంగా ఉన్నదని, ప్రతి చేనేత కార్మికుడు అర్హుడా కాదా అని ఎంక్వయిరీ చేయడానికి ఎటువంటి అభ్యంతరం లేదు, కానీ ప్రభుత్వ నిబంధనలు కార్మికునికి అందని ద్రాక్ష లాగా ఉన్నాయని, ముఖ్యంగా చేనేత కార్మికుని పని దినాలు ,సిల్క్ హౌస్ యజమానిని జిఎస్టి బిల్లులు ,రెండు సంవత్సరాల లావాదేవీలు, కార్మికుని వార్పు, రేషం ,బిల్లులు, బ్యాంకు లావాదేవీలు స్టేట్మెంట్ అడగడం కార్మికులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేయడం, నిరాశ నిస్పృహలకు లోను చేయడం కార్మికులను మోసం చేయడం తప్ప మరొకటి కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం విధించిన నిబంధనలను తొలగించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ అర్హులైన ప్రతి కార్మికునికి చేనేత పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం స్పందించాలని అందుకు అధికారులు సహకరించాలని విజ్ఞప్తి



చేయడం జరిగినది. ఈ సందర్భంగా చేనేత అధికారి అప్పాజీ గారు మాట్లాడుతూ కార్మికులను ఆదుకోవడం ప్రభుత్వ లక్ష్యమని అయితే ప్రభుత్వ నిబంధనలకు మేము వ్యతిరేకం కాదని ప్రభుత్వం చెప్పిన దానికి మేము పాటించక తప్పదని మీ డిమాండ్లను వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం జరిగే విధంగా మా వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇవ్వడం జరిగినది.

ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, ఏ ఖాదర్ బాషా, వి. వెంకటస్వామి ,అన్నం సూరి, ప్రకాష్ ,శ్రీనివాసులు, చౌడప్ప ఇంకా అనేకమంది చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# రైతు విజ్ఞాన యాత్రను ప్రారంభించిన కూటమి పార్టీ సీనియర్ నేత, మంత్రితండ్రి సత్యం

రైతన్నకు విజ్ఞానమే పెట్టుబడి

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 10:** రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించి, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పరిచయం చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు విజ్ఞాన యాత్ర' ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలోని కే.గంగవరం మరియు రామచంద్రపురం మండలాలకు చెందిన 50 మంది రైతులతో నిర్వహించిన ఈ రైతు విజ్ఞాన యాత్రను వాసంశెట్టి సత్యం, మార్కెట్ యార్డ్ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివ ప్రసాద్ చౌదరి జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవచ్చన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖలు రైతులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఈ యాత్రలో భాగంగా రైతులు సామర్లకోటలోని జీవన ఎరువుల తయారీ కేంద్రం, భూసార పరీక్ష కేంద్రం,




విత్తనాభివృద్ధి అనుసరణాత్మక పరిశోధన కేంద్రాలను సందర్శించి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగుమందుల నివారణ చర్యలపై అవగాహన పెంపొందించుకున్నారు.

ఎస్ఎం ఎఆర్ వ్యవసాయ అధికారి బి. జ్యోతి వరి పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు మార్గదర్శనం చేశారు. భూసార పరీక్ష కేంద్రం సహాయ సంచాలకులు మాధవి, వ్యవసాయ అధికారి విజయ్ మట్టి నమూనాల సేకరణ విధానం, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం జీవన ఎరువుల తయారీ కేంద్రాన్ని సందర్శించిన రైతులకు అక్కడ తయారయ్యే పీఎస్‌బీ, అజోస్పిరిల్లమ్, పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా ఉపయోగాలను వ్యవసాయ అధికారి పద్మ వివరించారు.

రైతులు పరిశోధనా కేంద్రాల్లో నిపుణులతో నేరుగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై విలువైన సమాచారం పొందారు.

ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారులు, వీఏఏలు జగదీశ్, గణేష్, శ్రీరామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు నిలువెత్తు రూపం

శిల్పా మహిళా సహకార్ బ్యాంక్..

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి

**అంకుశం న్యూస్ నంద్యాల్ సెప్టెంబర్ 10** ఎన్నికల కోసమో లేక ఓట్లకోసమో కాకుండా నిస్వార్థంగా గత 10 సంవత్సరాల నుండి నిర్విరామంగా మహిళా సాధికారతకు కృషిచేస్తున్న సంస్థగా మహిళల నమ్మకాన్ని చూరగొన్న సంస్థ శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ అని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గెలిచినా ఓడినా ఎటువంటి లాభాపేక్షలేకుండా ఎన్ని అడ్డంకులు వచ్చినా నిలబడి మహిళల అభివృద్ధికి అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన తెలిపారు. గురువారం శిల్పా సేవాసమితి కార్యాలయ ఆవరణంలో 167 మంది లబ్ధిదారులైన మహిళలకు 30 లక్షల 63వేల రూపాయల రుణాలకు సంబంధించిన చెక్కులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శిల్పా కుటుంబం ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేస్తామని, నిజాయితీగా ఉంటామని, నిజమే చెబుతారని, మోసాలు చెయ్యమని స్పష్టంచేశారు. గెలుపు ఓటములకు అతీతంగా నిర్విరామంగా



శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మంచి చేసేవారిని చెయ్యనివ్వకపోగా వారు మంచి చేసేదిలేదని పేర్కొన్నారు. అడ్డుకునే వారికి ఆస్తులు ఉన్నా అధికారాలు ఉన్నా ప్రజల కోసం మంచి చేసే మనస్తత్వం మాత్రం లేదని అన్నారు. శిల్పా సేవాసమితి సేవలను కక్షపూరితంగా అడ్డుకొని టెక్కె మార్కెట్ యార్డు కాంప్లెక్స్ నుండి శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ ను, రైతు సహకార్, మహిళా బ్యాంక్ ను ఖాళీ చేయించారని, అయితే అక్కడ ఏ ఒక్క దుకాణంలో నేటికీ వ్యాపారాలు చేయడం లేదని ఇది ప్రజలు గమనించాలన్నారు. మంచి చేసే సంస్థలను నడవనివ్వాలని హితవుపలికారు. శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ నుండి రుణాలు పొందిన మహిళలు వ్యాపారాలు చేపట్టి దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అలాగే కొత్త ఆలోచనలతో వ్యాపారాలు చేయాలని ఆసక్తి, ఉత్సాహం ఉన్న వారికి శిక్షణ అందించే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, మహిళలు పాల్గొన్నారు.

## గోరంట్ల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్



**అంకుశం న్యూస్ పుట్టపర్తి,సెప్టెంబర్,10:** శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ గోరంట్ల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించి, అనంతరం రెవెన్యూ సిబ్బంది మరియు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మ్యుటేషన్ల వేగవంతం: ప్రజల నుండి వచ్చిన మ్యుటేషన్ అప్లికేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ కాలయాపన చేయకుండా, నిర్దేశిత గడువు లోపు పారదర్శకంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పురోగతి: మండలంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే పురోగతిపై ఆరా తీశారు. సర్వే ప్రక్రియలో సరిహద్దు వివాదాలు లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ఆధారాలతో రికార్డులను సిద్ధం చేయాలని విఆర్‌ఓలు మరియు సర్వేయర్లకు సూచించారు. రెవెన్యూ సేవల పారదర్శకత: తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల (ప్రజల) సమస్యలను సానుభూతితో విని, పరిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యాలయ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని హెచ్చరించారు. సిబ్బంది హాజరు & పనితీరు: మండల కార్యాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల తహశీల్దార్ మధు నాయక్, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలు, విఆర్ఓలు, మండల సర్వేయర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కదిరిలో ఘనంగా పీఎం విశ్వకర్మ లోన్ ఉత్సవం


విశ్వకర్మ లబ్ధిదారులకు రుణాలు--మార్గదర్శకత్వం.. ఆర్థిక భరోసా






**అంకుశం న్యూస్,కదిరి,సెప్టెంబర్:10:** పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు రుణ సౌకర్యాలు,దరఖాస్తు ప్రక్రియ,ప్రభుత్వ ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు కదిరి ఎంపీడీవో కార్యాలయంలో పీఎం విశ్వకర్మ లోన్ ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పనీంద్ర కుమార్ మాట్లాడుతూ సంప్రదాయ చేతివృత్తిదారులు,కళాకారులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని తమ వృత్తులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎమ్మెస్ ఎం మీ అసిస్టెంట్ డైరెక్టర్ కే ఎల్ ఎస్ రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులకు బ్యాంకులు,సంబంధిత శాఖలు పూర్తి సహకారం అందించాలని తెలిపారు.లోన్ ఉత్సవంలో ఒకే వేదికపై రుణ దరఖాస్తుల స్వీకరణ, పలు బ్యాంకుల సేవలు,దరఖాస్తుల భర్తీకి సహాయం,పీఎం విశ్వకర్మ ప్రయోజనాలపై మార్గదర్శకత్వం,డాక్యుమెంటేషన్‌పై సహకారం అందించారు. కార్యక్రమంలో డిఐసి అధికారి దుర్గేష్,కదిరి విశ్వకర్మ ట్రైనింగ్ సెంటర్ ట్రైనర్ రమణారెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు వీర మారుతి, అంజనప్ప, నరసింహులు, బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు,అధికారులు,పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కదిరి పట్టణం వాణివీధిలో సమస్యలను పరిష్కరించండి జనసేనపార్టీ



**అంకుశం న్యూస్,కదిరి,సెప్టెంబర్:10:** బుధవారం జనసేన నాయకులు వాణివీధి లో సందర్శించినప్పుడు స్థానిక ప్రజలు పలు సమస్యలను దృష్టికి తీసుకొచ్చారని,వాటి పరిష్కరంలో భాగంగా గురువారం జనసేనపార్టీ పట్టణ అధ్యక్షులు చలపతి ఆధ్వర్యంలో జనసేనపార్టీ నాయకులు కదిరి మున్సిపల్ కమిషనర్ ను కలిసి వాణివీధిలో వీధిలైట్లు,కాలువలు క్లీనింగ్ అలాగే గతంలో మంచినీటి కొళాయిని మూసివేసినందువలన దానిని మళ్లీ పునరుద్ధరించాలని వినతి పత్రాన్ని ఇచ్చారు.దానికి మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ మా సిబ్బందిని పంపి మీరు చెప్పిన సమస్యలు తీరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంజిబాబు,రవికుమార్,ఇర్ఫాన్, రవీంద్ర నాయక్, గంగరాజు, సుదర్శన్,చక్రధర్ బాబు,ముని గోపాల్,సరస్వతి,అశోక్ కుమార్,రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

